క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కొడంగల్: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉషారాణి తెలిపారు. మండల కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన సమీక్ష జరగనుందని, సకాలంలో మండల పరిధి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



ఉత్సవమూర్తి

కుల్కచర్ల: శ్రీ కాళికామాత ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి కాళమ్మ దేవాలయానికి అమ్మవారిని తీసుకెళ్లడం, మంగళవారం శకటోత్సవం, బుధవారం రథోత్సవంతో పాటు హోమం నిర్వహించబడుతుందని తెలిపారు.

ఓబీసీ కన్వీనర్‌కు సన్మానం



సునీతను సన్మానిస్తున్న నాయకులు

యాలాల: టీపీసీసీ ఓబీసీ సెల్ కన్వీనర్‌గా నియమితులైన తాండూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సునీతను సోమవారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు బస్వరాజ్, భోజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు సంఘం అధ్యక్షుడు అక్బర్ బాబా, నాయకులు అమర్‌నాథ్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ ఉన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలను అందజేస్తున్న ప్రసన్న దంపతులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన కావలి కృష్ణయ్య జయమ్మ దంపతుల కూతురు భీమమ్మ వివాహానికి సుగంశెట్టి మహేశ్ కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ప్రసన్నశ్రీనివాస్ గౌడ్ దంపతులు పుస్తెమెట్టలను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో సాయి ముదిరాజ్, చెన్నయ్య, వెంకటయ్య, మల్లేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ తదితరులు

కుల్కచర్ల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధి బండవెల్కిచర్లలో సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి, మాట్లాడారు. రైతులు.. దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు మాంసం దుకాణాల బంద్



చికెన్ విక్రయదారుడికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా మున్సిపల్ పరిధిలో మంగళవారం మాంసం విక్రయ దుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సిబ్బందితో పట్టణంలోని పలు దుకాణాలకు నోటీసులు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే దుకాణ దారుడిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిండికూడా తిననివ్వరా?

- డ్రైవర్‌పై దాడి చేయడం ఎంతవరకు సబబు
- చేయిచేసుకున్న ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలి
- ప్రైవేట్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ల డిమాండ్



వికారాబాద్‌లో నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

అనంతగిరి: విరామ సమయంలో భోజనం చేస్తున్న డ్రైవర్‌పై చేయిచేసుకున్న ప్రయాణికుడిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ డిపో పరిధి ప్రైవేట్ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు.. పరిగి రోడ్డులో బస్సులు (హాల్ట్) నిలిపే ప్రదేశాల్లో బస్సులు తీయకుండా నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బస్సు డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు అకారణంగా దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. భోజన సమయంలో తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజమని, కనీసం తిండికూడా తిననివ్వరా అని వాపోయారు. ఇప్పటికే పరిమితికి మించిన ప్రయాణికులు బస్సుల్లో ఎక్కుతున్నారని, అయినా ఓపికతో వారిని వారివారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ సీఐ నాగరాజు, డీఎం భక్షినాయక్ డ్రైవర్ల సమస్యలు తెలుసుకున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు. జరిగిన ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వారికి చెప్పడంతో నిరసన విరమించారు.

సమయం ఉందంటే.. సహనం కోల్పోయి..

సంస్థ ప్రైవేటు బస్సులు నిలిపే ప్రాంతంలో భోజన విరామ సమయంలో ఆదివారం డ్రైవర్, కండక్టర్ భోజనం చేస్తున్నారు. వారి వద్దకు వచ్చిన ఓ ప్రయాణికుడు.. బస్సు ఇంకెప్పుడు తీస్తారు అని అడిగాడు. కొద్దిగా సమయం పడుతుందని డ్రైవర్ రాములు, కండక్టర్ స్వాతి బదులు ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తి కోపంతో.. బస్సు ఎక్కిన డ్రైవర్ రాములుపై దాడి చేశాడు. దీంతో సదరు వ్యక్తిపై వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇబ్బంది పడిన ప్రయాణికులు

డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్లు చేపట్టిన నిరసనతో డిపో పరిధి 22 ప్రైవేట్ వాహనాల సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో వికారాబాద్–పరిగి, వికారాబాద్–సదాశివపేట, వికారాబాద్–శంకర్‌పల్లి రూట్లలో బస్సులు తిరగపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అసలే భగ్గున మండుతున్న ఎండలతో ఇబ్బంది పడుతుండగా.. బస్సుల కొరత నిరీక్షించి నీరసించిపోయారు. ఉన్న రెగ్యులర్ బస్సులను పంపినా రద్దీతో ఇబ్బంది పడ్డారు.

కేసు నమోదు

అనంతగిరి: బస్ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఆర్టీసీ ప్రైవేట్ బస్సు డ్రైవర్ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా ఆర్టీసీ ఉద్యోగులపైన దాడి చేస్తే, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి వలన ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మూగజీవాల దాహం తీరేదెలా?

శిథిలమైన పశువుల నీటితొట్లు



చౌదర్‌పల్లిలో నిరుపయోగంగా నీటి తొట్టి

బొంరాస్‌పేట: దాహం తీర్చుకునేందుకు మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. మండే ఎండలతో చెరువులు, కుంటలు ఎండిపోగా.. ఉన్న నీటి తొట్లు ఖాళీగా ఉండటంతో గుక్కెడు నీటికోసం అలమటిస్తున్నాయి. పశు పక్షాదుల దాహం తీర్చేందుకు గతంలో వేలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో నీటితొట్లు నిర్మించారు. కానీ వాటిల్లో నీరు పోసేవారు లేక.. కొన్నిచోట్ల వట్టిపోయి దర్శనమివ్వగా.. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. మాకు ఇది కావాలని చెప్పుకోలేని జీవాల విషయంలో నిర్లక్ష్యం తగని, నోరులేని పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లలో నీటిని నింపేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘కొండా’కు మద్దతుగా..



నామినేషన్ కేంద్రానికి తరలి వెళ్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా సోమవారం మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు మాట్లాడారు. రాష్ట్రంలోని అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవబోతున్నారని జోష్యం చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజల్లో పార్టీ పట్ల ఎనలేని అభిమానం ఉందని, దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, మండల అధ్యక్షుడు సూర్యకాంతం, ప్రధాన కార్యదర్శి హన్మంతు, నర్సింహ రెడ్డి, కాటనిపల్లి ఆంజనేయులు, నాయకులు కాటనిపల్లి మైపాల్, గడుసు మైపాల్, అంజిలయ్య, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోయిన బీఆర్‌ఎస్



తాండూరు రూరల్: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: బీఆర్‌ఎస్ చిట్టిఘనాపూర్ నాయకులు సుమారు 100 మంది సోమవారం ఎమ్మెల్యే మనోహార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తాండూరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కార్యకర్తలను పట్టించుకోకుండా విదేశాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తంచేవారు.

దోమలో..



దోమ: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే టీఆర్ఆర్

దోమ: మండల పరిధి బడంపల్లి మాజీ సర్పంచ్ కవిత దంపతులు సోమవారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాలనను చూసి, బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే తమ అభిమతంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

మాజీ సర్పంచ్ మృతి

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధి బీరోల్ మాజీ సర్పంచ్ బోయిని నర్సింలు(40) సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యపిల్లలు అనాథలయ్యారని, ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబీకులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మరమ్మతుల వివరాలు తెలపండి



సమీక్షలో మాట్లాడుతున్న ఏఈ కిరణ్

దౌల్తాబాద్: పాఠశాలల్లో చేసిన మరమ్మతులు, తదితర వివరాలను నమోదు చేసి నివేదిక అందజేయాలని పంచాయతీరాజ్ ఏఈ కిరణ్ సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధి అమ్మ ఆదర్శకమిటీ సభ్యులు, హెచ్‌ఎంలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలను మనఊరు–మనబడి కింద మరమ్మతు పనులు చేయించారని, ఇంకా పనులు చేపట్టాల్సిన పాఠశాలలు ఏమైనా ఉంటే వాటి వివరాలను తెలపాలని చెప్పారు. రెండు రోజుల్లో విద్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్నందున సూచించిన వివరాలను వెంటనే తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, హెచ్‌ఎం ఊషన్న ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో సీఐ

బొంరాస్‌పేట: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు నిఘా ఉంచారు. ఇందులో భాగంగా సోమవారం మండల పరిధి బొంరాస్‌పేట, రేగడిమైలారం, తుంకిమెట్ల, ఎన్కేపల్లి, వడిచర్ల, మహంతిపూర్, దుద్యాల మండల కేంద్రంలోని ఏడు పోలింగ్ కేంద్రాలను కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. 18 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, నిఘా ఉంచినట్లు తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించి, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ ఎండీ రవూఫ్, ఇబ్బంది ఉన్నారు.

వేతనాలు చెల్లించండి

అనంతగిరి: మెడికల్ విభాగంలో పనిచేస్తున్న 104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా చూడాలని, ఈ విషయంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కార్మికులకు రెగ్యులర్‌గా..

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలువురు కార్మికులతో కలిసి డీపీఓకు వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల్లో నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకు సబ్బులు, నూనె, యూనిఫాం తదితర వాటిని వెంటనే అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ యాంకర్ డాలి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువులో రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని, వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదని చెప్పారు. నచ్చిన రంగాల్లో శిక్షణ పొందాలని, ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ యూసుఫ్, పాఠశాల ఇన్‌చార్జి రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం




బోదంపహాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సురేందర్‌రెడ్డి తదితరులు

టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి మన్‌మర్రి, బోదంపహాడ్, అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిరెడ్డిగూడ గ్రామాల్లో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, కేంద్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి అత్యధిక పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్ బాగుంటుందని, పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఇంటింటికీ తిరిగి పార్టీ గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించి, రంజిత్ విజయానికి కృషి చేయాలని వెల్లడించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భర్గవ్‌రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డిలు మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుత ఆరు గ్యారంటీలతో పాటు మరిన్ని పథకాల అమలుకు కసరత్తు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు ఆకర్షితులైన ప్రజలు.. రంజిత్ రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, ఎంపీటీసీలు గుండాల అశోక్, కుమ్మరి చెన్నయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు అశ్విణి, పార్టీ సీనియర్ నాయకుడు మంగలి చెన్నయ్య, పామెన నర్సింలు, రవీందర్, చిన్నయ్య, నవీన్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, సత్తయ్య, శ్రీరాంరెడ్డి, అబేద్ పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా



ఇంటింటి ప్రచారంలో వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఆ పార్టీ నేతలు రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధి మొగిలిగిద్ద గ్రామంలో బూత్ అధ్యక్షుడు ఆనంద్, సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేశారని వెల్లడించారు. కరోనా కాలం నుంచి దేశంలోని పేదలందరికీ కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని తెలిపారు. పేదల కోసం పనిచేస్తున్న మోదీని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అందుకోసం బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించి, నియోజకవర్గాన్ని మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోగుల నర్సింలు, నారని శ్రావణ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

చేవెళ్ల: పెరుగుతున్న ఎండలతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివేకానంద ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు సూచించారు. వేసవికాలం నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం దేవునిఎర్రవల్లి సమీపంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండే ఎండలకు ప్రజలు దూరంగా ఉండాలని చెప్పారు. నీరు ఎక్కువగా తాగాలని, అవసరమైతే తప్ప బయట తిరగొద్దని తెలిపారు. వేసవి సెలవులు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

రైతును కాపాడుకోవాలి..

దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, రియల్ వ్యాపారాలు, కంపెనీలు తదితర వాటితో రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎంత సాంకేతిక పెరిగినా.. సగటు మనిషి తినేందుకు కావాల్సింది ఆహారమేనని చెప్పారు. తిండి గింజలు పండించే రైతును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెల్లడించారు. అన్నదాత లేకపోతే ఈ సమాజానికి తిండి ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణుకుమార్, మేనేజర్ నరేశ్, అధ్యాపకులు వేణుగోపాల్, వెంకట్, ఋషి, నూర్జాహాన్ పాల్గొన్నారు.

కుక్కలు ‘భౌ’బోయ్

- రాత్రిళ్లు రోడ్లపైకి రావడానికి భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



షాబాద్‌లో వీధుల్లో సంచరిస్తున్న గ్రామ సింహాలు

షాబాద్: వీధికుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. వీటి బారినపడిన ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నా.. శునకాల కట్టడికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కనిపించిన వారిని తరుముతూ.. విచక్షణారహితంగా దాడి చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడదతో జనాలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద తప్పడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి నాగరగూడ, పోతుగల్, తాళ్లపల్లి, రుద్రారం, హైతాబాద్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులను గాయపరుస్తున్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తరచూ ఘటనలు

మండల పరిధి గ్రామాల్లో వీధికుక్కల దాడులు పెరుగుతున్నాయి. ఇటీవల నాగరగూడ, తాళ్లపల్లి, షాబాద్, పోతుగల్ గ్రామాల్లో 5 మందిపై కుక్కలు తీవ్రంగా దాడి చేశాయి. అదేవిధంగా గత నెలలో ఓ రెండేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రేగడిదోస్వాడ, తిమ్మారెడ్డిగూడ, చందనవెల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకల మందపై దాడి చేయడంతో అవి మృత్యువాత పడ్డాయి. రహదారిపై వెళ్లే వాహనదారులను వెంబడించడంతో కిందపడి గాయాలపాలయ్యారు. వీధికుక్కలు.. ప్రజలతో పాటు మూగజీవాలపై దాడులకు తెగబడుతుండటంతో అవి అవి మృత్యువాత పడుతున్నాయి.

చీకటిపడితే అంతే సంగతులు..

ఆలస్యంగా పనులు ముగించుకొని అర్ధరాత్రి నివాసాలకు వచ్చే వారిపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించడంతో వారు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు, వాకింగ్ చేసే వారితో పాటు పనుల కోసం బయటకు వెళ్లే వారిపై సైతం వీధి కుక్కలు గుంపులుగా వచ్చి దాడులకు పాల్పడుతున్నాయి. మండలంలో ఇలాంటి సంఘటనలు గతంలో అనేకం జరిగాయి.

పట్టించుకోని యంత్రాంగం..

వీధి కుక్కల దాడులు పెరుగుతున్నా.. సంబంధిత అధికారులు వాటి కట్టడిలో విఫలమవుతున్నారు. సిబ్బంది కొరతతోనే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని తెలుస్తోంది. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



నాగరగూడ, పోతుగల్ మధ్యన నిత్యం శునకాలు రెచ్చిపోతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కుక్కల నివారణకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

–ముక్తర్, నాగర్‌గూడ, షాబాద్

చర్యలు తీసుకుంటాం



కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామాలు, మండల కేంద్రాల్లో తిరిగే కుక్కలను గుర్తించి పట్టుకుంటాం. శాస్త్రీయంగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

–హన్మంతరెడ్డి, ఎంపీఓ, షాబాద్